తొలిపూజకు సర్వం సిద్ధం

- వాడవాడలా వినాయక చవితి సందడి
- మట్టి ప్రతిమలకే జై కొడుతున్న భక్తులు


మట్టి గణపతి విగ్రహం


వనంలో విగ్రహం

మధురవాడ: తొలిపూజ వినాయక చవితి ఉత్సవాల సందడి ఆరంభమైంది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలూ ఉత్సవశోభను సంతరించుకున్నాయి. పల్లెలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు... అన్నిచోట్లా గణపతిని పూజించేందుకు ఉత్సాహంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక గణేష్ నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయాల్లో నవరాత్రి ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు.

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కార్మికవాడలో ఆదివారం వివిధ స్వచ్ఛంద సంస్థలు మూడు వేల మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశాయి. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో షిర్డీ సాయి బాబా ఆలయం వద్ద వెయ్యి ప్రతిమలు పంపిణీ చేశారు. క్లబ్ చైర్మన్ ఆలవిల్లి శ్రీను, పూర్వ అధ్యక్షులు దుర్గా శేఖర్, బొర్రా లక్ష్మణ్‌కుమార్, ఉప్పల సాయిరామ్, ఆదిమూలం నాగరాజు, ఎం.సునీల్ పాల్గొన్నారు. అంబేడ్కర్ కూడలిలో భీమిలి నీడీ వెల్ఫేర్ సొసైటీ, ఫ్యాట్, ఓఎస్‌జీ ఫౌండేషన్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 1500 ప్రతిమలు పంపిణీ చేశారు. రంగూరి సీతారాం దొర, వెంపాడ శ్రీనివాసరెడ్డి, మ్యాస్ రెడ్డి, వాండ్రాసి సతీష్, దళాయి శివ, దినేష్, గేదెల తరుణ్, చైతన్యరెడ్డి పాల్గొన్నారు. బీజేపీ భీమిలి నాయకురాలు శీరపు రామలక్ష్మి ఆధ్వర్యంలో 500 మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. కురుమెల్ల కవిత, శీరపు వెంకటరెడ్డి, గుజ్జు నర్సుబాయి, వెంకటేశ్వరరావు, తోణంగి రాము, ధరణి, పంపాన సుబ్రహ్మణ్యం, అయినాడ మాధవ్, చిల్ల త్రినాథరెడ్డి, విజయ పాల్గొన్నారు.


గణపతి మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

చిప్పాడలో వినాయకవనం

వినాయక చవితి ఉత్సవాల్లో ఏకవింశతి పత్రాలకు అత్యంత ప్రాధాన్యముంది. నవరాత్రులపాటు ఔషధాలుగా పేర్కొనే 21 రకాల పత్రాలతో గణపతిని పూజించి చెరువులు, నదులు, సముద్రంలో విగ్రహంతోపాటు నిమజ్జనం చేస్తే కాలుష్యాన్ని హరిస్తాయని ప్రతీతి. ఈ ఏకవింశతి పత్రాల జాతులను భీమిలి మండలం చిప్పాడ శివారులో వినాయకవనం పేరుతో 15 సెంట్లు స్థలంలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఏకవింశతి పత్రాలు సేకరించి అందరూ ఇళ్లు, మండపాల వద్ద పూజలు జరుపుకుంటే... చిప్పాడలో మాత్రం 21 పత్రాలను నాటి వనంలా అభివృద్ధి చేశారు. ఈ వనంలోనే వినాయక విగ్రహాన్ని ఉంచి చవితి రోజు గ్రామస్తులంతా పూజలు చేస్తారు.


అంబేడ్కర్ కూడలిలో ప్రతిమలు పంపిణీ చేస్తున్న భీమిలి సీఐ రమేష్

పద్మనాభం: మట్టి వినాయకుని పూజిస్తే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్దిలో సింహాద్రి సెల్ పాయింట్ నిర్వాహకుడు కాళ్ల అప్పలనాయుడు సమకూర్చిన 110 మట్టి ప్రతిమలు ఆదివారం పంపిణీ చేశారు. బాందేవపురం కో – ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు, కాళ్ల అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు బుగత ఎర్నాయుడు, కనకల ప్రకాష్, బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

భీమునిపట్నం: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు 500 మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. పార్టీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, వాసుపల్లి కొండబాబు, మైలిపల్లి లక్ష్మణరావు, కోండ్రు రామసూర్యుడు, వాసుపల్లి ఎల్లాజీరావు, ముక్కి కృష్ణ, అనపర్తి సూర్యప్రకాశరావు, చెల్లూరి గౌరినాయుడు, బోని సంజీవరావు, ప్రగడ చంటి పాల్గొన్నారు.

తగరపువలస: స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఆదివారం సాయంత్రం భీమిలి సీఐ డి.రమేష్ ఆధ్వర్యంలో 500 మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతిమలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు గంటా హరీష్, భరత్ కుమార్ రాజు పాల్గొన్నారు.


గణేష్‌నగర్‌లోని ఆలయంలో విజయగణపతి


గణపతి మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న వెంపాడ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు


భీమిలిలో ప్రతిమలు పంపిణీ చేస్తున్న నాయకులు


మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు


చిప్పాడలో 21 పత్రాలు ఉన్న వినాయక వనం

కిక్కిరిసిన చవితి మార్కెట్


కొనుగోలుదారులతో రద్దీగా మారిన తగరపువలస ప్రధాన రహదారి

తగరపువలస: వినాయక చవితి పర్వదినం సందర్భంగా తగరపువలస ప్రైవేట్ మార్కెట్ రెండు రోజులుగా సందడిగా కనిపిస్తోంది. ప్రధాన రహదారి చిరువ్యాపారులతో నిండిపోయింది. గణపతి విగ్రహాలతోపాటు పండ్లు, అలంకరణ సామాగ్రి, పువ్వులు, పత్రి, అరటి ఆకులు తదితర వస్తువులు విక్రయించే వ్యాపారులతో అంబేడ్కరు కూడలి నుంచి తాతా థియేటర్ వరకు ఇరువైపులా రహదారి నిండిపోయింది. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో చుట్టూ తిరిగి రావాల్సి వచ్చింది. చాలా వరకు వాహనాలను ఆంధ్రాబ్యాంకు నుంచి తాతా థియేటర్ మార్గంలో మళ్లించారు. మార్కెట్‌లో దొంగతనాలు జరగకుండా ముందు జాగ్రత్తగా భీమిలి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వస్త్ర దుకాణాలు కూడా కిటకిటలాడాయి.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

హోమియో మందుల పంపిణీ


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ 102 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.చంద్రశేఖరరావు, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు వి.లక్ష్మణరావు, వి.రాంబాబు, ఎం.శంకర్, గంధరాము, సాయి, దివ్య పాల్గొన్నారు.

హిందీ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు

తగరపువలస: హిందీ భాష ఆవశ్యకతపై భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కల్పించారు. 74వ హిందీ భాషా పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకుడు ఎస్.ఎమ్.కె.రాజు మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకోవడం ద్వారా జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

క్రీడాకారులకు జెర్సీల పంపిణీ


క్రికెట్ క్రీడాకారులకు జెర్సీలు అందిస్తున్న బుడ్డిగ బాలబాబు

తగరపువలస: సంగివలస శ్రీపోలమాంబ క్రికెట్ జట్టుకు ఆదివారం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు రామన్నపేటకు చెందిన బుడ్డిగ బాలబాబు రూ.20 వేల విలువైన జెర్సీలు అందించారు. తన అన్నయ్య నాగరాజు జ్ఞాపకార్థం వీటిని అందించినట్టు బాలబాబు తెలిపారు. కార్యక్రమంలో వెంపాడ శ్రీనివాస రెడ్డి, భీమిలి క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అక్కరమాని లోవరాజు పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

బీచ్‌రోడ్డు : వారం రోజుల కిందట చోరీకి గురైన సొత్తును ఆదివారం ఈస్ట్ క్రైమ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సిరిపురంలోని సీషెల్ గేటెడ్ కమ్యూనిటీలో నివసిస్తున్న ఒక వృద్ధురాలు వారం రోజుల కిందట తన ఇంట్లో బంగారం కనిపించటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన క్రైమ్ పోలీసులు వృద్ధురాలి వద్ద పని చేస్తున్న కృష్ణవేణిని పలు కోణాల్లో విచారించారు. దాంతో తానే ఇద్దరు వ్యక్తులతో దొంగతనం చేయించినట్లు ఒప్పుకుంది. పోలీసులు వారి వద్ద నుంచి చోరీకి గురైన సొత్తు మొత్తం స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు. అతి తక్కువ సమయంలో కేసును ఛేదించిన ఈస్ట్ క్రైమ్ సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ అభినందించారు.

అందరూ కలిసినా వైఎస్సార్ సీపీదే విజయం


వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్నందున ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఢీకొట్టేందుకు అన్ని పార్టీలు ఏకమై వస్తున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అందరూ కలిసి వచ్చినా 2024 ఎన్నికల్లో మరలా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. జీవీఎంసీ 5వ వార్డు సాయిరాం కాలనీలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని పార్టీలు ఏకమై మూకుమ్మడిగా వైఎస్సార్‌సీపీపై దాడి చేస్తున్నాయని, వీటిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రశ్నిస్తానని పార్టీ పెట్టిన పవన్ కళ్యాణ్ ప్యాకేజీతో సరిపెట్టుకుంటున్నారని, ఆయనను నమ్ముకున్న కార్యకర్తలకు, నాయకులకు అన్యాయం చేసి తనకు తాను న్యాయం చేసుకుంటున్నారన్నారు. సాయిరాం కాలనీలో త్వరలోనే మంచినీటి సమస్య పరిష్కరిస్తామని, ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు రావాలని స్థానికులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతు, అధ్యక్షులు పోతిన సురేష్, 6వ వార్డు అధ్యక్షులు బొట్టా అప్పలరాజు, జేఎస్ రెడ్డి, ముచ్చు రామారావు, బోయి సూరిరెడ్డి, శ్యామలరావు, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, బాజ్జీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని ఊరేగింపు ఉత్సవం



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


మజ్జివలసలో శ్రీకృష్ణుని ఊరేగింపు ఉత్సవం

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలసలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక సభ్యులు ఆనందాశ్రమం నుంచి శ్రీకృష్ణుని విగ్రహ ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మజ్జివలస, లక్ష్మీపురం పంచాయతీల్లో నిర్వహించిన ఊరేగింపులో శ్రీకృష్ణ భక్తులు కోలాటం, సన్నాయిమేళం, భగవద్గీత శ్లోక నినాదాలు చేశారు. రాధాకృష్ణ వేషధారణలు ఆకట్టుకున్నాయి. ప్రబోధ కమిటీ అధ్యక్షుడు వి.చిరంజీవి వర్మ, వి.గౌతమ్‌వర్మ, సుంకరశ్రీను, ఎం.గురప్ప, కె.సన్యాసి, వి.రోజామణి, ఎస్.దేవి, కె.కనకం, కె.వెంకటలక్ష్మి, కె.సూర్యం తదితరులు పాల్గొన్నారు. ఆనందాశ్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు దాట్ల పెదబాబు, తుపాకుల ఆదిలక్ష్మి, అప్పలరాజు, బోని బంగారునాయుడు, గాడు వెంకటప్పడు, గాడు వెంకటనారాయణ తదితరులు సందర్శించి పల్లకీసేవలో పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

పద్మనాభం: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో బీజేపీ మండల నాయకులు, విశాఖపట్నం కేజీహెచ్ గాయత్రి వీధి విక్రయదారుల సంక్షేమ సంఘం సంయుక్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ యువత సమరయోధుల బాటలో నడవాలన్నదే ప్రధాని మోదీ ఆశయమన్నారు. అనంతరం విద్యార్థినులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసరావు, ఎం.అప్పలరమణ, పి.కృష్ణారావు, హెచ్.మహేష్, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

భీమునిపట్నం: స్థానిక పెద్దబజారు వద్దనున్న శ్రీదాస ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో అర్చకులు వంశీమోహన చెన్న కృష్ణమాచార్యులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు వాసుపల్లి శ్రీహరి, కంటుభుక్త సునీత, పోలుబోతు విజయ, పాసి అప్పలనాయుడు పాల్గొన్నారు.

సూర్యభగవానుడికి పూజలు


సూర్యభగవానుడి సన్నిధిలో పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ వద్ద సూర్యభగవానుడి ఆయంలో ఆదివారం భక్తుల తాకిడి నెలకొంది. సింహాచలం దేవస్థానం నిర్మించిన ఈ ఆలయంలో సూర్యభగవానుడిని రోజూ భక్తులు దర్శించుకుంటున్నారు. ఆదివారం మరింత ఎక్కువ సంఖ్యలో దర్శించుకుని పూజలు చేస్తున్నారు. అటు సింహాచలం, అడవివరం, దారపాలెం, పైనాపిల్ కాలనీ.. ఇటు శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆరిలోవ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా సింహాచలం దేవస్థానం సిబ్బంది ఇక్కడకు వచ్చే భక్తులకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.

వైభవంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు


విశ్వకర్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


భీమిలి రోడ్డులో నిత్యావసర సరకులు అందిస్తున్న సభ్యులు

మధురవాడ: మధురవాడ వైఎస్సార్ కాలనీలో గల విశ్వకర్మ ఆలయంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పలువురు నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ గత రెండు రోజులుగా మధురవాడ శ్రీ విశ్వకర్మ భగవాన్ కార్పెంటరీ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ భగవాన్ విశ్వకర్మ జయంతి యజ్ఞ పూజ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా లక్కోజు ఓంకార్ ఆచార్య సిద్ధాంతి హోమం నిర్వహిచారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తనయుడు, హీరో రవితేజ, పలువురు టీడీపీ, ఇతర పార్టీల నాయకులు కూడా ఇక్కడ పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, బొట్ట అప్పలరాజు, కార్పెంటరీ కళాకారుల సంక్షేమ సేవా సంఘం నాయకులు గిడిజాల పార్వతీశం, కురుమోజు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: భీమిలి రోడ్డులో విశ్వకర్మ కార్పెంటర్స్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతి నిర్వహించారు. పెరలసిస్‌తో మంచానికే పరిమితమైన ముసినాడ రమేష్‌కు దాతల సాయంతో బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు, వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వినూత్న పథకాలు ప్రవేశపెట్టి, వాటి అమలుకు అధిక నిధులు ఖర్చు చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం జనాభా రెండింతలు పెరిగినా అవే కొనసాగుతుండడంతో అందరికీ ప్రభుత్వ వైద్యం అందని పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రహించారన్నారు. ఈ మేరకు ప్రతి మండలానికి అదనంగా మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేశారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుటుంబ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి గ్రామాలకే వైద్యులను పంపిస్తున్న ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందని కొనియాడారు. ఆరోగ్యశ్రీని మరింత మెరుగుపరిచి వేయి రూపాయలు ఖర్చు దాటిన అన్ని రోగాలకు మన రాష్ట్రంతోపాటు పక్క రాష్ట్రంలో కూడా ఉచితంగా వైద్యం చేసుకునే అవకాశం కల్పించారన్నారు. వైద్య సేవలను మరింత మెరుగుపరచడానికి జగనన్న ఆరోగ్య సురక్షను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో వైద్యశాలలు ఉన్నా వేలాది ఉద్యోగాలు గతంలో ఖాళీగా ఉండిపోవడంతో ఎక్కడా సేవలు సక్రమంగా అందని పరిస్థితి ఏర్పడిందన్నారు.

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 54 వేల వైద్య ఉద్యోగాలను భర్తీ చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్న విద్యార్థులకు వైద్య విద్యను అందించాలనే ఉద్దేశంతో ఒకేసారి 15 ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించి, అందులో ఇప్పటికే ఐదు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. మరలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పథకాలన్నీ సక్రమంగా అందుతాయని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన నేళ్తేరు జట్టుని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి జగదీశ్వర రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సర్పంచ్‌లు లొడగల రాజేశ్వరి, చందక లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, పాండ్రింకి అప్పారావు, బొట్టా రామకృష్ణ, లొడగల రమణ, చందక సూరిబాబు, కోన శ్రీను, రౌతు వెంకటరావు, పిన్నింటి వెంకట రమణ, కోరాడ ముసిలినాయుడు, వెంకట అప్పారావు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


ఉత్సవ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న సీఐ రామచంద్రరావు

ఆనందపురం : వినాయక ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆనందపురం సీఐ రామచంద్రరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉత్సవాల నిర్వాహకులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపం ఏర్పాటు చేసే స్థలం వివరాలు, విద్యుత్ సరఫరా, సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జనం వివరాలను పోలీసులకు అందజేసి అనుమతి పొందాలని సూచించారు. స్పీకర్లు రాత్రి 10 గంటల వరకే వినియోగించాలని, అశ్లీల నృత్యాలు, అనుమతి లేని కార్యక్రమాలు ఏర్పాటు చేయరాదన్నారు. మండపాల వద్ద ఎటువంటి సంఘటనలు జరిగినా అనుమతి పొందిన కమిటీ సభ్యులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి మండపంపైన పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.